ప్రయాణికులూ.. అటెన్షన్ ప్లీజ్..!

- 21 బస్టాప్‌ల వద్ద టైమింగ్ బోర్డుల ఏర్పాటు
- మద్దిలపాలెం నుంచి తగరపువలస వరకూ..



వెంకోజీపాలెం బస్టాప్ వద్ద ఏర్పాటు చేసిన టైమింగ్ బోర్డు

మద్దిలపాలెం: ప్రయాణికుల సౌకర్యార్థం బస్టాప్‌ల వద్ద టైమింగ్ బోర్డుల ఏర్పాటుకు ఆర్టీసీ అధికారులు శ్రీకారం చుట్టారు. మద్దిలపాలెం డిపో నుంచి తగరపువలస వరకూ ఉన్న బస్టాప్‌ల వద్ద ఈ బోర్డులను ఏర్పాటు చేశారు. రోడ్డుకు ఇరువైపుల ఉన్న బస్టాప్‌ల పేరుతో పాటు, ఆయా స్టాప్‌ల వద్ద ఆగే బస్సుల సమయాలను సూచిస్తూ బోర్డులు పెట్టారు. ఆయా రూటులో నడిచే బస్సుల వివరాలను పొందుపరిచారు.

- మద్దిలపాలెం నుంచి తగరపువలస వరకూ 21 బస్టాప్‌లు ఉన్నాయి. బుల్లయ్య కళాశాల బస్టాప్ నుంచి రామాటాకీస్, ఇసుకతోట, వెంకోజీపాలెం, హనుమంతవాక, పాత డెయిరీ ఫారం, జూ, ఎండాడ, లా కాలేజీ, కారు షెడ్, చంద్రంపాలెం, కొమ్మాది, మధురవాడ, మారికవలస, బోరవానిపాలెం, పరదేశిపాలెం, బోయపాలెం, భీమిలి క్రాస్ రోడ్డు, తగరపువలస వద్ద బస్టాప్‌లు ఉన్నాయి. వీటిలో కొన్ని స్టాప్‌లకు షెల్టర్లు ఏర్పాటు చేయాల్సి ఉందని మద్దిలపాలెం డిపో మేనేజర్ అరుణకుమారి తెలిపారు. ఈ స్టాప్‌ల వద్ద బస్సు సర్వీసుల సమయాల వివరాలతో బోర్డులు ఏర్పాటు చేశామన్నారు.

మద్దిపాలెం డిపో నుంచి రోజూ 116 సర్వీసులు

మద్దిలపాలెం డిపో నుంచి ప్రతి రోజు 116 బస్సులు వివిధ రూట్లలో తిరుగుతున్నాయని డీఎం తెలిపారు. వీటిలో సుదూర ప్రాంతాలకు 17 సర్వీసులున్నాయన్నారు. మిగతా 99 బస్సులు సిటీ పరిధిలో వివిధ రూట్లలో నడుస్తున్నాయన్నారు.

జైలు ఆవరణలో జిమ్ పరికరాల ఏర్పాటు


జైలులో జిమ్ పరికరాలు ప్రారంభిస్తున్న సింబయాసిస్ అధినేత నరేష్‌కుమార్, ఐజీ ఇండ్ల

ఆరిలోవ: సింబయాసిస్ కంపెనీ అధినేత ఒ.నరేష్‌కుమార్ సహకారంతో విశాఖ కేంద్ర కారాగారం ఆవరణలోని ఉద్యోగుల క్వార్టర్స్‌లో జిమ్ పరికరాలు ఏర్పాటు చేశారు. వీటిని జైళ్ల శాఖ ఐజీ ఇండ్ల శ్రీనివాస్ సింబయాసిస్ అధినేతతో కలసి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఐజీ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలన్నారు. పరికరాలు ఏర్పాటు చేసిన నరేష్‌కుమార్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జైల్ సూపరింటెండెంట్ ఎస్.రాహుల్, అధికారులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

మద్దిలపాలెం: ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. మద్దిలపాలెం డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ కళాశాలలో రెండు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. బుధవారం నుంచి ఈ పరీక్షలు జరగనున్నాయి. కృష్ణా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఒక పరీక్ష కేంద్రం ఏర్పాటు చేయగా.. దీనికి చీఫ్ సూపరింటెండెంట్‌గా నాగమణి, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్‌గా షకీలను నియమించారు. ఈ కేంద్రంలో ఇంటర్ ప్రథమ సంవత్సరం విద్యార్థులు 680 మంది పరీక్ష రాయనున్నారు. కళాశాలలో 17 గదులు కేటాయించారు.

- మరో పరీక్ష కేంద్రాన్ని డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కేటాయించారు. దీనికి చీఫ్ సూపరింటెండెంట్‌గా సూర్యకుమారి, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్‌గా ఎ.శ్రీనివాసరావును నియమించారు. ఈ కేంద్రంలో 682 మంది ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షకు హాజరుకానున్నారు. కళాశాలలో 13 గదులు కేటాయించారు.

శ్రీకృష్ణాపురం గురుకులంలో పరీక్ష కేంద్రం

ఆరిలోవ: శ్రీకృష్ణాపురం గురుకులంలో ఇంటర్మీడియట్ పరీక్ష కేంద్రం ఏర్పాటు చేశారు. బుధవారం నుంచి ఇంటర్ పరీక్షలు జరగనున్న విషయం తెలిసిందే. ఈ కేంద్రంలో 563 మంది మొదటి సంవత్సరం విద్యార్థులు, 356 మంది ద్వితీయ సంవత్సరం విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్టు గురుకులం ప్రిన్సిపాల్ ఫ్లోరెన్స్ తెలిపారు.

20 మంది ఇన్విజిలేటర్లను నియమించామన్నారు. పరీక్షల కోసం ఇక్కడ 20 గదులు సిద్ధం చేశామన్నారు. విద్యార్థులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు ఉదయం 8.30 గంటలకు కేంద్రానికి చేరుకోవాలని ఆమె సూచించారు.

క్లుప్తంగా

ఘనంగా మొల్లమాంబ జయంతి

ఆరిలోవ: జీవీఎంసీ 9వ వార్డు డెయిరీఫారం సమీప భారతరత్న ఐటీఐ ప్రాంగణంలో విశాఖ శాలివాహన వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం మొల్లమాంబ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కవయిత్రి మొల్ల చిత్ర పటానికి అసోసియేషన్ కమిటీ సభ్యులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కమిటీ అడ్వైజర్ వి.వి.ఎస్.మూర్తి మాట్లాడుతూ కవయిత్రి రాసిన మొల్ల రామాయణం విశిష్టతను వివరించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు వై.రమణయ్య, సత్యనారాయణ, అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

22వ వార్డులో రక్తదానం


రక్తదానం చేస్తున్న కార్పొరేటర్ మూర్తి

బీచ్ రోడ్డు: జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఆశయాలను ప్రజల్లోకి తీసుకు వెళ్లాలని కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్ కోరారు. మంగళవారం జనసేన ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా 22వ వార్డులో రక్తదాన శిబిరం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో చైతన్య రూప, శేఖర్ పాల్గొన్నారు.

కనక మహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన


అష్టదళ పద్మారాధనలో పలువురు ఉభయదాతలు

డాబాగార్డెన్స్: నగరంలోని బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి కె.శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, సహాయ కార్యనిర్వహణాధికారి వెంపలి రాంబాబు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

16న సహస్ర తులసిపూజ

కనక మహాలక్ష్మి దేవస్థానంలో ఈ నెల 16న సహస్ర తులసిపూజ నిర్వహించనున్నామని ఆలయ కార్యనిర్వహణాధికారి శిరీష తెలిపారు. ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలచే భక్తులు పూజా రుసుము రూ.1500 చెల్లించి పాల్గొనవచ్చని ఆమె పేర్కొన్నారు.

విద్యార్థులకు హాల్‌టికెట్లు ఇవ్వాలని వినతి


ఆర్‌ఐవో ఉమారాణికి వినతిపత్రం అందజేస్తున్న ప్రతినిధులు

అల్లిపురం: జిల్లాలో గల ప్రైవేట్, కార్పొరేట్ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఫీజు చెల్లిస్తేనే హాల్ టికెట్లు ఇస్తామని కళాశాల యాజమాన్యాలు మానసికంగా వేధిస్తున్నాయని, వారిపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ ప్రతినిధులు డిమాండ్ చేశారు. విద్యార్థులందరికీ హాల్ టికెట్లు ఇప్పించేలా చర్యలు తీసుకోవాలని వారు ఆర్‌ఐవో ఉమారాణిని ఆమె కార్యాలయంలో మంగళవారం కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ మేరకు ఆర్‌ఐవో సారుకూలంగా స్పందిస్తూ అన్ని ప్రైవేట్, కార్పొరేట్ కళాశాలలకు హాల్ టికెట్లు ఇవ్వాలని ఆదేశాలు జారీ చేశామని తెలిపారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నగర అధ్యక్షుడు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

మహిళా సాధికారత హర్షణీయం

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి గోపి


కార్యక్రమంలో పాల్గొన్న న్యాయమూర్తి గోపి

విశాఖ లీగల్: మహిళలు మార్గదర్శకులుగా ఎదుగుతూ మహిళా సాధికారతను సాధిస్తున్న విధానం హర్షణీయమని జిల్లా ప్రధాన న్యాయమూర్తి గుత్తాల గోపి అన్నారు. జిల్లా కోర్టు ప్రాంగణంలో న్యాయవాదుల గ్రంథాలయంలో మంగళవారం సాయంత్రం మహిళా న్యాయవాదుల సమాఖ్య ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ అన్ని రంగాల్లో మహిళలు తమ సామర్థ్యాలతో రాణిస్తున్న విధానం అభిలషణీయమన్నారు. వృత్తిపట్ల అంకిత భావం, నిరంతరం విధి నిర్వహణలో నిబద్ధతతో ఉన్నత స్థానాలు అధిరోహిస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో కుటుంబ న్యాయస్థానం అదనపు జిల్లా న్యాయమూర్తి కె.వాణిశ్రీ, సమాఖ్య అధ్యక్షురాలు డి.మంజులత, బార్ కౌన్సిల్ ఉపాధ్యక్షుడు కె.రామజోగేశ్వరరావు, సభ్యులు ఎస్.కృష్ణమోహన్, న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు చింతపల్లి రాంబాబు, ఉపాధ్యక్షురాలు బి.ఎస్.లత, కార్యదర్శి పైలా శ్రీనివాసరావు, సీనియర్ న్యాయవాదులు పప్పు అనూరాధ, కృష్ణకుమారి, మహిళా ప్రతినిధి కె.ఎల్.డి.నాగశ్రీ, పెద్ద సంఖ్యలో న్యాయవాదులు పాల్గొన్నారు.

గురుకులం విద్యార్థులకు వాటర్ బాటిళ్ల అందజేత

ఆరిలోవ: శ్రీకృష్ణాపురంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ గురుకులంలో సావిత్రీబాయి పూలే ఎడ్యుకేషనల్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మంగళవారం వాటర్ బాటిళ్లు పంపిణీ చేశారు. 350 మంది విద్యార్థులకు వీటిని అందజేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ సభ్యులకు గురుకులం ప్రిన్సిపాల్ ఫ్లోరెన్స్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు సీతామహాలక్ష్మి, సురేఖ, గురుకులం ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

160 కేజీల గంజాయి పట్టివేత

మర్రిపాలెం: కంచరపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో గంజాయి తరలిస్తుండగా టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేశారు. పశ్చిమ బంగాకు చెందిన ఐదుగుర్ని అరెస్టు చేశారు. ముందుగా అందిన సమాచారం మేరకు ఐటీఐ జంక్షన్ వద్ద కాపుగాసి గంజాయి తరలిస్తున్న నిందితులను టాస్క్‌ఫోర్స్ పోలీసులు, ఐదో పట్టణ సీఐ విజయ్‌కుమార్ సంయుక్తంగా అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 160 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లా నుంచి పశ్చిమబంగాకు తరలిస్తున్న అల్లాద్దీన్ షేక్, అలామిన్ షేక్, అలేమా బీబీ, షేక్ సయ్‌ఫుల్, షకీరుల్ ఖాన్ అరెస్టు చేసి, వీరి 6 సెల్ ఫోన్లు, రూ.7వేలు స్వాధీనం చేసుకున్నారు.

యూకే ఉపకార వేతనాలకు దరఖాస్తులు

బీచ్ రోడ్డు: యూకేలో ఉన్న ఆరు ప్రముఖ విద్యా సంస్థల్లో చదువుకునే భారత్ మహిళలకు ఉపకార వేతనాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు బ్రిటిష్ కౌన్సిల్ ఇండియా ప్రతినిధి రితికా చంద్ర ఒక ప్రకటనలో తెలిపారు. సైన్స్, టెక్నాలజీ, ఇంజినీరింగ్, మ్యాథ్స్‌లో ఉన్నత విద్య కోసం యూకేలోని విద్యా సంస్థల్లో చేరిన విద్యార్థులకు వీసా, ఆరోగ్య బీమా వర్తింపు ఫీజులు, ట్యూషన్ ఫీజు, ఇంగ్లిష్ భాషా అభివృద్ధి కోసం సహాయ సహకారాలు అందిస్తామన్నారు. మరిన్ని వివరాల కోసం www.britishcouncil.org వెబ్‌సైట్‌ను సందర్శించాలని కోరారు.

రోబోటిక్స్‌లో ఏయూ స్కూల్ విద్యార్థుల ప్రతిభ


విద్యార్థులను అభినందిస్తున్న శిరీన్ రెహమాన్

ఏయూక్యాంపస్: ఆంధ్రాయూనివర్సిటీ ఇంగ్లిష్ మీడియం స్కూల్ విద్యార్థులు రోబోటిక్ పోటీల్లో ప్రతిభ చూపారు. ఇటీవల పుణేలోని శ్రీ శివ ఛత్రపతి శివాజీ స్టేడియంలో నిర్వహించిన ఎఫ్‌టీసీ రోబోటిక్స్ స్టెమ్ టెక్నాలజీ టోర్నమెంట్‌లో పాల్గొని ప్రతిభ చాటారు. ఈ పోటీల్లో 60 జాతీయ, 11 అంతర్జాతీయ జట్లు పాల్గొన్నాయి. ఆంధ్రప్రదేశ్ నుంచి పాల్గొన్న ఏయూ విద్యార్థుల బృందం పుణే, చెన్నై, గుజరాత్ వంటి ఇతర రాష్ట్రాల జట్లతో ఇజ్రాయిల్, రొమేనియా వంటి అంతర్జాతీయ జట్లతో పోటీపడ్డారు. 71 జట్లలో ఏయూ జట్టు 28వ స్థానంలో నిలిచింది. ఏయూ జట్టుకు స్టెమ్ యంగ్ అచీవర్ అవార్డు లభించింది. ఏయూ ఇంగ్లిష్ మీడియం స్కూల్ విద్యార్థులకు రోబోటిక్స్ రంగంలో అవసరమైన శిక్షణ, నైపుణ్యాలను ఎస్ఆర్‌ఐలు మాజీ ఎమ్మెల్యే డాక్టర్ రహమాన్, శిరీన్ రహమాన్ దంపతుల కుమారుడు సమీర్ షేక్, సంతోష్ అందించారు. ఈ ఘనత సాధించిన విద్యార్థులను చైతన్య స్రవంతి స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షురాలు డాక్టర్ శిరీన్ రహమాన్ అభినందించారు.

కేకే-2లైన్‌లో జనరల్ మేనేజర్ తనిఖీలు


కోరాపుట్ స్టేషన్‌లో పర్యటిస్తున్న ఈస్ట్‌కోస్ట్‌రైల్వే జీఎం మనోజ్‌శర్మ

తాటిచెట్లపాలెం: ఈస్ట్‌కోస్ట్‌రైల్వే జనరల్ మేనేజర్ మనోజ్ శర్మ మంగళవారం వాల్తేర్ డివిజన్ పరిధిలోని కేకే -2 (కిరండూల్-కోరాపుట్)లైన్లో డీఆర్ఎం అనూప్‌కుమార్ సత్పతితో కలిసి తనిఖీలు నిర్వహించారు. ఈ సెక్షన్ పరిధిలోని సైడింగ్స్, రైల్వే కార్యాలయాలు, రైల్వే స్టేషన్లు, ఎన్ఎండీసీ మైనింగ్ సైట్ ప్రాంతాలను తనిఖీ చేశారు. విండో ట్రైలింగ్ తనిఖీల ద్వారా మలుపులు, వంతెనలు, పాయింట్స్ అండ్ క్రాసింగ్స్‌ను పరిశీలించారు. కిరండూల్-జగదల్‌పూర్ సెక్షన్‌లో గల డబ్లింగ్ పనులను, సైడింగ్ పనులను, అమృత్ భారత్ పథకం కింద ఎంపికై అభివృద్ధి చేయాల్సిన స్టేషన్‌లను పరిశీలించారు. కిరండూల్, జగదల్‌పూర్, జైపూర్, కోరాపుట్ స్టేషన్‌లలో తనిఖీలు చేపట్టి ఆ ప్రాంతాల్లోని ప్రజా ప్రతినిధులు, వివిధ సంస్థల ప్రతినిధులు, మీడియా ప్రతినిధులతో జనరల్ మేనేజర్ మనోజ్ శర్మ సమావేశమయ్యారు. వారి నుంచి సలహాలు, సూచనలు తీసుకున్నారు.

క్రికెట్ మ్యాచ్ టికెట్ల కోలాహలం


మున్సిపల్ స్టేడియంలో టికెట్ల కోసం క్యూ కట్టిన క్రికెట్ అభిమానులు

జగదాంబ: ప్రతిష్టాత్మకమైన భారత్-ఆస్ట్రేలియా జట్ల మధ్య జరిగే ఒక్కరోజు అంతర్జాతీయ క్రికెట్ మ్యాచ్‌కు ముందుగానే విశాఖలో కోలాహలం మొదలైంది. మ్యాచ్ టికెట్ విక్రయాలను మంగళవారం నగరంలో మూడు వేదికల్లో చేపట్టారు. వీటిలోని వన్ టౌన్ వెలంపేటలో ఉన్న ఇందిరా ప్రియదర్శిని మున్సిపల్ స్టేడియం వద్ద తెల్లవారు జాము నుంచే క్రికెట్ అభిమానులు బారులు తీరారు. క్రికెట్ మ్యాచ్ టికెట్ల కొనుగోలు కోసం పోటీపడ్డారు. రూ.600, రూ.1500, రూ.2 వేలు, రూ.3 వేలు, రూ.3500, రూ.6వేలు టికెట్ల కోసం అభిమానులు క్యూ కట్టారు. అయితే అమ్మకాలు ప్రారంభించిన కొద్ది గంటల్లోనే టికెట్లు అమ్ముడుపోయాయి. ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్, విశాఖ జిల్లా క్రికెట్ సంఘం సంయుక్త ఆధ్వర్యంలో వన్ టౌన్ పోలీసుల గట్టి బందోబస్తు మధ్య ఈ టికెట్ల విక్రయాలు సాగాయి.

ప్రేమ పేరుతో అమ్మాయిలకు గాలం

విశాఖ వాసికి రిమాండ్

పుట్టపర్తి: ప్రేమ పేరుతో అమ్మాయిలకు గాలం వేసి, వారి ఫొటోలు, వీడియోలు తీసి మార్ఫింగ్ చేస్తూ బ్లాక్‌మెయిల్‌కు పాల్పడుతున్న విశాఖపట్నానికి చెందిన యువకుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలను బుక్కపట్నం ఎస్ఐ నరసింహుడు మంగళవారం వెల్లడించారు. పుట్టపర్తి నియోజకవర్గానికి చెందిన ఓ యువతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు డీఎస్పీ యశ్వంత్ నేతృత్వంలో దర్యాప్తు చేపట్టిన పోలీసులు విశాఖపట్నం ప్రాంతానికి చెందిన చంద్రమౌళిని సోమవారం అదుపులోకి తీసుకున్నారు. విచారణలో తాను చేసిన నేరాలను నిందితుడు అంగీకరించాడు. చంద్రమౌళికి ఇదివరకే వివాహమైంది. కళాశాల విద్యార్థినులు పలువురిని ప్రేమ పేరుతో నమ్మించి, వారికి తెలియకుండా ఫొటోలు, వీడియోలు తీసి అసభ్యకరమైన చిత్రాలతో మార్ఫింగ్ చేసేవాడు.

అనంతరం వాటిని విద్యార్థినులకు చూపి బ్లాక్‌మెయిల్ చేసేవాడు. కొన్నేళ్లుగా హైదరాబాద్, వైజాగ్, కర్ణాటక తదితర ప్రాంతాల్లో ఈ తరహా మోసాలకు పాల్పడ్డాడు. ఈ క్రమంలో నిందితుడి ఉచ్చులో చిక్కుకున్న పుట్టపర్తి నియోజకవర్గానికి చెందిన యువతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు నిందితుడి అసలు బాగోతం వెలుగు చూసింది. విచారణ అనంతరం మంగళవారం నిందితుడిని అరెస్ట్ చూసి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.

అప్పుఘర్‌లో దుప్పట్ల వితరణ


గర్భిణులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

ఎంవీపీ కాలనీ: స్థానిక సెక్టార్-9 అప్పుఘర్‌లో గర్భిణులకు సిద్ధార్థ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం దుప్పట్లు పంపిణీ చేశారు. 30 మంది గర్భిణులకు దుప్పట్లతో పాటు గుడ్లు, పాలు, పోషక పదార్థాలు అందజేశారు. ఈ సందర్భంగా వీఎంసీ కళాశాల ప్రిన్సిపాల్ జగదీశ్వరరావు మాట్లాడుతూ తల్లీబిడ్డల ఆరోగ్యం చాలా అవసరమన్నారు. గర్భిణులు అత్యంత పోషక విలువలతో కూడి ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు ఉషారాణి, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

శ్రీగోవత్స రామాయణం పుస్తకావిష్కరణ


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న రచయిత్రి మంథా సత్యప్రభ

ఎంవీపీ కాలనీ: శ్రీగోవత్స రామాయణం గేయ పద్య రూప పుస్తకాన్ని రచయిత్రి మంథా సత్యప్రభ మంగళవారం ఆవిష్కరించారు. ఎంవీపీ కాలనీ సెక్టార్-11లోని కార్యాలయంలో ఈ పుస్తక ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రామాయణం అనేక మంది కవులు రచించిన సుమధుర కావ్యమన్నారు. సమాజాన్ని సన్మార్గంలో నడిపించే గొప్ప కావ్యంగా ఇది నిలిచిందన్నారు. అనేక రూపాల్లో అందుబాటులో ఉన్న రామాయణాన్ని శ్రీగోవత్స రామాయణంగా గేయ పద్య రూపంలో తాను రచించినట్టు ఆమె తెలిపారు. ఈ పద్యాలు పిల్లలు, పెద్దల్లో విజ్ఞానాన్ని, మంచి నడవడికను పెంచేలా ఉంటాయన్నారు. ఈ పుస్తకం ఆన్‌లైన్‌లో వినియోగదారులకు అందుబాటులో ఉందన్నారు. హిందీ భాషతో పాటు ఆడియో, వీడియో రూపంలో కూడా త్వరలో అందుబాటులోకి తేనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మంథా గోపాలకృష్ణ, శివ సూర్యప్రతాప్, హరవంశీకృష్ణ పాల్గొన్నారు.

గెడ్డలోకి దూసుకెళ్లిన కారు

పెదగంట్యాడ పీహెచ్‌సీ వైద్యాధికారికి గాయాలు


గెడ్డలోకి దూసుకెళ్లిన కారు, పక్కన డాక్టర్ రమేష్‌బాబు

పెదగంట్యాడ: మండలంలోని వినాయనగర్ వుడా కాలనీ కమ్యూనిటీ హాల్ సమీపంలో మంగళవారం ఓ కారు అదుపుతప్పి గెడ్డలోకి దూసుకెళ్లింది. దీంతో కారులో ఉన్న పెదగంట్యాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ రమేష్‌బాబుకు స్వల్ప గాయాలయ్యాయి. ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం.. వినాయకనగర్ వుడా కాలనీలో గల సీడబ్ల్యూసీలో మంగళవారం నిర్వహించనున్న ఫ్యామిలీ ఫిజిషియన్ కార్యక్రమానికి హాజరయ్యందుకు వైద్యాధికారి రమేష్‌బాబు వచ్చారు. ఆ కార్యక్రమాన్ని ముగించుకుని తిరిగి వెళ్లేందుకు ఆయన గెడ్డ పక్కన పార్కింగ్ చేసిన కారును తీస్తుండగా ఒక్కసారిగా కారు ముందుకు వెళ్లిపోయింది. దానిని కంట్రోల్ చేసేలోగా గెడ్డలోకి దూసుకెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో ఆయన స్వల్ప గాయాలతో బయట పడ్డారు. గమనించిన స్థానికులు వెంటనే అతన్ని కిమ్స్ ఐకాన్ ఆస్పత్రికి తరలించారు. గెడ్డలో ఉన్న కారును జీవీఎంసీ అధికారులు జేసీబీ సాయంతో బయటకు తీశారు. ఈ ప్రమాదంపై ఎటువంటి ఫిర్యాదు అందలేదని న్యూపోర్టు సీఐ రాము తెలిపారు.

నులిపురుగుల నివారణ మాత్రల పంపిణీ


నులిపురుగుల నిర్మూలన పోస్టర్‌ను ప్రదర్శిస్తున్న సమతా కళాశాల సిబ్బంది

ఆరిలోవ: జాతీయ నులిపురుగుల నిర్మూలన వారోత్సవాల్లో భాగంగా మంగళవారం 12వ వార్డు నెహ్రూనగర్ అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలకు నులిపురుగుల నివారణ మాత్రలు పంపిణీ చేశారు. ఆరిలోవ-1 సచివాలయం ఏఎన్ఎం పద్మ, ఆశా కార్యకర్త చంద్రకళ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు కన్నేటి సుబ్బారెడ్డి, అర్జున్ పాల్గొని చిన్నారులకు అల్బెండజోల్ మాత్రలు అందజేశారు.

సమత కళాశాలలో..


ఎంవీపీ కాలనీ: జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని ఎంవీపీ కాలనీలోని సమతా డిగ్రీ, పీజీ కళాశాలలో నిర్వహించారు. కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు వ్యక్తులు మాట్లాడుతూ పిల్లల ఆరోగ్యవంతమైన జీవనం కోసం నులిపురుగుల నివారణ తప్పనిసరన్నారు. విద్యార్థులు చేతి గోళ్లను శుభ్రంగా ఉంచుకోవాలని, భోజనం చేయక ముందు, చేసిన తరువాత చేతులను శుభ్రంగా కడుక్కోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు అల్బెండజోల్ 400 మిల్లీగ్రాముల మాత్రలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ జి.శ్రీనివాసరావు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

రైతుబజార్‌లో గుర్తింపు కార్డుల తనిఖీ


ఎంవీపీ రైతుబజార్‌లో రికార్డులు, రైతుల కార్డులను పరిశీలిస్తున్న మార్కెటింగ్ అధికారి షేక్ యాసిన్

ఆరిలోవ: ఎంవీపీ రైతు బజార్‌ను జిల్లా వ్యవసాయ వాణిజ్య మార్కెటింగ్ శాఖ అధికారి షేక్ యాసిన్ మంగళవారం సందర్శించారు. ఇక్కడ షాపులను పరిశీలించారు. ఎంత మంది రైతులు ఉన్నారు.. వారికి ఎక్కడెక్కడ షాపులు కేటాయించారో రైతుబజార్ ఈవో జి.ప్రసాద్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఈవో, సిబ్బందితో కలసి అన్ని షాపుల వద్దకు వెళ్లి రైతుల గుర్తింపు కార్డులను పరిశీలించారు. గుర్తింపు కార్డుల్లో ఫొటోలు, వారు ఇచ్చిన దరఖాస్తులో ఫొటోలను పోల్చి చూశారు. అనంతరం ఈవో కార్యాలయంలో రికార్డులు తనిఖీ చేశారు. రికార్డుల్లో నమోదైన ప్రకారం కేటాయించిన నంబర్లతో షాపుల్లో రైతులు ఉన్నారో? లేదో? పరిశీలించారు. నకిలీలు లేకుండా చూడాలని, గుర్తింపు కార్డు లేనివారికి షాపులు అప్పగించవద్దని ఈవోకు ఆయన సూచించారు.

కానూరి మృతికి సంతాపం


సూర్యనారాయణ (ఫైల్)

అల్లిపురం: సీపీఐ సీనియర్ నాయకులు కానూరి సూర్యనారాయణ (85) గత కొన్ని రోజులుగా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందారు. ఆయన మృతిపట్ల సీపీఐ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు, నాయకులు అల్లు బాబూరావు నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కానూరి సత్యనారాయణ పార్టీ సభ్యుడిగా వివిధ బాధ్యతలు నిర్వహించారన్నారు. పార్టీకి ఆయన చేసిన సేవలు మరువలేనివని కొనియాడారు. పార్టీ నాయకులు దుంప శ్రీనివాసరావు, కానూరి రాంబాబు, మోర అప్పలరాజు, మావూరి వీర్రాజు, నూలు ఆదినారాయణ, జల్లి సూర్యనారాయణ, తదితరులు సంతాపం తెలియజేశారు.